క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

కాకినాడ రూరల్: కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో దీర్ఘకాలిక వ్యాధిగస్తులు, వృద్ధులకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మల్లేశ్వరి మాట్లాడుతూ, ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయాలనేదే తమ సంఘం లక్ష్యమన్నారు. ఆ విధంగా ప్రతి నెలా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీదేవి, సభ్యురాలు మోహినీకుమారి, రిటైర్డ్ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఓం నమశ్శివాయ, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఏపీసీకి పీఆర్‌టీయూ అభినందనలు



ఏపీసీని అభినందిస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్రశిక్షా కాకినాడ జిల్లా ఏపీసీగా బాధ్యతలు స్వీకరించిన పి.వేణుగోపాల్‌ను పీఆర్‌టీయూ జిల్లా శాఖ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్, పీఎఫ్ బకాయిలు, ఎస్‌ఎల్ బకాయిలు వంటి విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం జిల్లాలో నూతనంగా ఏర్పాటైన పీఆర్‌టీయూ కార్యవర్గ సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఆయనను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, ప్రతినిధులు బండి నూకరాజు, పడాల ఏడుకొండలు, వాకాడ వెంకటరమణ, కుంచె సాంబశివరావు, ఏజీవీ సుబ్బారావు, వంగా శ్రీను, కామేశ్వరరావు ఉన్నారు.

రక్తదాత అజహర్‌కు సత్కారం



అజహర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ సిటీ: కాకినాడ ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో 44వ సారి రక్తదానం చేసిన జనాబ్ అజహర్‌కు రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, కమిటీ సభ్యులు మంగళవారం సత్కరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి హసన్ షరీఫ్ మాట్లాడుతూ, కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి నెలా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం అవసరం అవుతుందన్నారు. వారి కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి అజహర్ రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఆయన యువకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు చిష్టి, కార్యదర్శి హుస్సేన్, సభ్యులు మౌలానా ఎహితిషాముల్ హక్, నవాబ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం పూజలు ప్రారంభం

కరప: పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ధనుర్మాసం రాకను స్వాగతిస్తూ ప్రతి ఇంటా ముత్యాల ముగ్గులు, హరిదాసుల మేలుకొలుపు, డూడూ బసవన్నల విన్యాసాలు తదితర కార్యక్రమాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం 6.50 గంటలకు ధనుర్మాసం ప్రారంభమవ్వగా, మండలంలో మంగళవారం నుంచి విష్ణ్వాలయాల్లో పూజలు ప్రారంభించారు. ఈ మాసంలో పండగలు వైష్ణవ సంప్రదాయంలో జరుగుతాయని కరప విష్ణ్వాలయం ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. భోగి రోజున గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందన్నారు. యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంభించినట్టు అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులు తెలిపారు. కొంగోడు, పెనుగుదురు, కూరాడ, జెడ్.భావారం గ్రామాల్లోని విష్ణు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాసం నెల రోజులు స్వామివార్లకు తెల్లవారుజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పిస్తారు. నిత్యం సుప్రభాత సేవ, తీర్థపు బిందె, తిరుప్పావై ప్రవచనాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు వంటివి జరుగుతాయి.

నాగబాబుకు అభినందనలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కృష్ణా జిల్లా ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన యాతం నాగబాబు మంగళవారం కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలను వారి క్యాంప్ కార్యాలయాల్లో కలిశారు. ఇప్పటి వరకు తాను గెలుచుకున్న పతకాల వివరాలు ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీకి వివరించారు. ప్రభుత్వం తరఫున తనకు సౌకర్యాలు అందించాలని ఈ సందర్భంగా నాగబాబు వారిని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని సూచించారు.

ఎనీ టైం అవుటాఫ్ ఆర్డర్

- పని చేయని ఏటీఏంలు, డిపాజిట్ మెషీన్లు
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు
- నిర్వహణ సక్రమంగా లేదని అసంతృప్తి



జేఎన్‌టీయూకే క్యాంపస్‌లో ఏటీఎం, డిపాజిట్ మెషీన్

బాలాజీచెరువు: చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టులు, బంగారు రుణాలు వంటి సేవలు మినహా డిపాజిట్, విత్‌డ్రా వంటి సేవలు మెషీన్ల ద్వారా చేసుకోవాలని బ్యాంకు అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈ సేవలకు ఏటీఎం మెషీన్లతో పాటు, డిపాజిట్ మెషీన్లు ఉన్నాయి. ఇందులో తమకు సమాచారం వస్తున్నా, అవి ఏ మాత్రం అక్కరకు రావడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు.

నగరంలో నాగమల్లితోట జంక్షన్, కరణంగారి జంక్షన్, ఆర్‌టీఓ కార్యాలయం రోడ్డు, భానుగుడి, మెయిన్ రోడ్, జగన్నాథపురం, పెద్ద మార్కెట్, సినిమా రోడ్, దేవాలయం వీధితో పాటు, జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ప్రాంగణంలో డిపాజిట్ మెషీన్లు ఉన్నాయి. ఇవి ఎప్పుడు ఆఫ్‌లైన్ అని స్క్రీన్‌పై డిస్‌ప్లే వస్తుండడంతో ఖాతాదారులు నిరుత్సాహపడుతున్నారు. డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్, యూపీఐ వంటి సౌకర్యాలున్న చాలామంది ఇప్పటికీ ఏటీఎం మెషీన్లు వాడుతున్నారు. ముఖ్యంగా పెన్షన్‌దారులు, యాభై ఏళ్లు పైబడిన వారు ఏటీఎం మెషీన్ ద్వారా నగదు పొందుతున్నారు. అత్యవసరమై వీటి ద్వారా నగదు తీసుకుందామని వస్తే, తీరా అవి పని చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వ్యక్తికి అవసరమైన బ్యాంకింగ్ సేవలకు మెషీన్లు మొరాయించడంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఈ విషయమై ఎస్‌బీఐ ఆర్‌ఎం తపోధన్‌ను వివరణ కోరగా, ఏటీఎం మెషీన్లలో నగదుతో పాటు, డిపాజిట్ మెషిన్లు నిరంతరాయంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తరచుగా వీటిని వినియోగించడంతో హ్యాంగ్ అవుతున్నాయని చెప్పారు. అత్యవసరమైతే బ్యాంకుల ద్వారా నగదు విత్‌డ్రాతో పాటు, డిపాజిట్ చేయవచ్చని సూచించారు.

పని చేయడం లేదు



నగదు డిపాజిట్ చేద్దామంటే డిపాజిట్ మెషీన్ పనిచేయడం లేదు. బ్రాంచ్‌లో డిపాజిట్ మెషీన్ ద్వారా చేసుకోమంటున్నారు. బ్యాంకులో కంటే ఇక్కడే పని సులువుగా అవుతుందనుకుంటే ఇక్కడా అదే తీరు.

– పి.రవితేజ, కాకినాడ

సక్రమంగా నిర్వహించాలి



ఏటీఏంలకు సంబంధించి మెయింటెనెన్స్ సక్రమంగా చేయాలి. వీటిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలి. చాలా చోట్ల మెషీన్లు పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. యూపీఐ వంటివి పని చేయకపోతే చాలామంది ఏటీఏంలను ఆశ్రయిస్తున్నారు.

– కె.సాయిబాబు, ప్రైవేట్ ఉద్యోగి, జగన్నాథపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున, ఒకరికి మూడు రోజుల జైలు, 15 మందికి రెండు రోజుల చొప్పున జైలు, ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

కాకినాడ వన్ టౌన్, కోరంగి, గొల్లపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, 9 మందికి రెండు రోజుల జైలు, 20 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.

డీసీ చైర్మన్‌గా పీజీ ఎన్నిక



కరప డీసీ చైర్మన్ పీజీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

కరప: మండలంలోని కరప డీసీ చైర్మన్‌గా పుణ్యమంతుల గంగసత్యనారాయణ(పీజీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారి బి.గోవింద్ సమక్షంలో వేములవాడ, కరప, అరట్లకట్ట, పెనుగుదురు, గొర్రిపూడి, సంపర సాగునీటి సంఘాల అధ్యక్షులు పీజీ సత్యనారాయణ, మెర్ల వీరవెంకట ప్రభాకరచౌదరి, సింగం సుబ్బారావు, తుమ్మలపల్లి గోవిందరాజులు, జోకా అప్పలరాజు సమావేశమయ్యారు. కరప డీసీ చైర్మన్‌గా పీజీ సత్యనారాయణ(వేములవాడ), ఉపాధ్యక్షుడిగా మెర్ల వీరవెంకట ప్రభాకరచౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గోవిందు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

సిరిపురం డీసీ ఎన్నిక

అలాగే సిరిపురం డీసీ పరిధిలోని వెల్ల, తోటపేట, పెనుమళ్ల, సిరిపురం, యండమూరు, పెద్దాపురప్పాడు సాగునీటి సంఘాల అధ్యక్షులు సమావేశమయ్యారు. సిరిపురం డీసీ అధ్యక్షుడిగా పేపకాయల నారాయణరావు(పెనుమళ్ల), ఉపాధ్యక్షుడిగా బిరుదా శ్రీనివాసరావు(పెద్దాపురప్పాడు) ఎన్నికయ్యారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సర్పంచ్‌ల ఆగ్రహం

- అధికారులను నిలదీసిన నేమాం, తిమ్మాపురం సర్పంచ్‌లు
- సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఘటన



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు సూర్యప్రకాశరావు, సత్యనారాయణ

కాకినాడ రూరల్: అయిన వారికి కంచం, కాని వారికి ఆకు.. అన్నట్టుగా తయారైంది కూటమి ప్రభుత్వ తీరు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఈ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కూటమి పార్టీల నేతల సిఫారసులకే అధికారులు ఊ కొట్టడంతో.. రాజ్యాంగబద్ధంగా అధికారంలో ఉన్న సర్పంచ్‌లు కొన్ని పంచాయతీల్లో ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ సానుభూతి సర్పంచ్‌లు ఉన్న గ్రామాల్లో పరిస్థితి మరి అధ్వానంగా మారింది. మంగళవారం కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండు గ్రామాల సర్పంచ్‌లు వెళ్లగక్కిన ఆవేదన ఈ పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది. వివరాల్లోకి వెళితే..

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై సర్పంచ్‌లు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. వేదికపై ఎంపీడీఓ పి.సతీష్, ఎంపీపీ బందిలి వీరీష, ఈఓ పీఆర్‌అండ్‌ఆర్డీ రమణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖల అధికారులు ఆశీనులయ్యారు. శిక్షణపై సీనియర్ పంచాయతీ కార్యదర్శి పాండురంగరావు వివరిస్తుండగా, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ జోక్యం చేసుకుని.. గ్రామాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను లేవనెత్తారు. గ్రామ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని, వారికి సేవలు చేయాల్సిన తమకు అధికారులు సహకరించకుండా పదవుల్లో లేనివారికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. అధికారులు తమ గ్రామంలోకి వచ్చి కూడా ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఎంపీడీఓ సతీష్ కలుగజేసుకుని, ఇది శిక్షణ కార్యక్రమమని, సమస్యలుంటే తనకు నేరుగా లేదా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. తమ గ్రామంలోని ఓహెచ్ఆర్ ట్యాంక్‌కు పొరుగున ఉన్న తమ్మవరం పంచాయతీలో తీర్మానం చేయడం ఏమిటని నేమాం సర్పంచ్ సూర్యప్రకాశరావు నిలదీశారు. తీర్మానం చేయించిన పంచాయతీ కార్యదర్శి సమాధానం చెప్పాలన్నారు. అసలు పంచాయతీ రాజ్ వ్యవస్థ అంటూ ఉందా అని సర్పంచ్ బెజవాడ ప్రశ్నించారు. పంచాయతీ అధికారులు ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్నారా లేక రాజకీయ పార్టీల నుంచి జీతాలు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. తమకు గౌరవం లేనప్పుడు సమావేశాలు, శిక్షణలు దేనికంటూ ప్రశ్నించారు. పంచాయతీలను బలోపేతం చేస్తామని, సర్పంచ్‌ల ప్రొటోకాల్ పాటిస్తామని పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ చెబుతుండగా, క్షేత్ర స్థాయికి వచ్చేసరికి అధికారులు మాత్రం పైనుంచి ఒత్తిళ్లని చెబుతున్నారన్నారు. తిమ్మాపురం గ్రామంలో పైపులైన్ దెబ్బతినంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సోమవారం ఉదయమే సమస్యను తెలియజేస్తే, తమకు తెలియకుండానే ఆయన ఫీల్డ్‌లోకి వెళ్లారని, దీనిపై వార్డు సభ్యులు తామెందుకని ప్రశ్నిస్తున్నారన్నారు. అధికారులు గ్రామంలోకి వస్తే సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని, ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్‌లను ఓవర్ టేక్ చేయడం తగదన్నారు. గ్రామాల్లో వర్కుల తీర్మానాలకు మాత్రమే సర్పంచ్‌లు పనిచేస్తారా, ఎవరో చెబితే జనాల్లేని చోట రూ.80 లక్షలతో తిమ్మాపురంలో రోడ్డు వేశారని బెజవాడ సత్యనారాయణ నిలదీశారు.

ఎంపీడీఓపై మండిపాటు

గత ఐదేళ్లుగా రోడ్లు వేయలేదని, ఇప్పుడు ప్రాధాన్యం ప్రకారం నిర్మిస్తున్నామని చెప్పిన ఎంపీడీఓ సతీష్‌పై సర్పంచ్‌లు బెజవాడ, రామదేవు మండిపడ్డారు. ఐదేళ్లు రోడ్లు వేయలేదని ఎలా చెబుతారని, తమ గ్రామం తిమ్మాపురంలో కరోనాకు ముందు రూ.3.5 కోట్లతో రోడ్లు వేశారని గుర్తుచేశారు. సర్పంచ్‌ల ఎదురుదాడితో కంగుతిన్న ఆయన.. ఉపాధి హామీ రోడ్లు వేయలేదని సర్దిచెప్పారు. పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలను ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడే వారిని నిలదీయని అధికారులు.. చిన్న పూలకొట్టు వ్యాపారిపై ప్రతాపం చూపుతున్నారని బెజవాడ ధ్వజమెత్తారు. తిమ్మాపురంలో ఇంటిని షాపులుగా మర్చినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మండల కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.అనుపమ మాట్లాడుతూ, గ్రామాల్లోని స్థితిగతులను పరిశీలించి, ప్రభుత్వ సూచనల మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఎంపీహెచ్ఓ వైఎస్ రత్నకుమారి వైద్యారోగ్య శాఖ ద్వారా అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. తొమ్మిది థీమ్స్‌లో ఆ గ్రామంలో వెనుకబడిన అంశాన్ని గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

మంత్రి గారూ.. ఇటు చూడరూ..!

- స్మార్ట్ సిటీలో సమస్యల తిష్ట
- సుందర నగరం.. నేడు మురికి కూపం
- నేడు జిల్లాకు మంత్రి నారాయణ రాక



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం

కాకినాడ: పారిశుద్ధ్య విభాగంలో దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిన కాకినాడ నగరపాలక సంస్థ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు మురికి కూపంగా మారుతోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా మారి, అభివృద్ధి కానరాక అన్ని విభాగాల్లో పురపాలన పరంగా అస్తవ్యస్తంగా తయారైంది. పురపాలక శాఖ మంత్రి నారాయణ మంత్రి హోదాలో బుధవారం కాకినాడ వస్తోన్న నేపథ్యంలో ఈ ప్రాంత సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో కాకినాడ పారిశుద్ధ్య విభాగంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. మెరుగైన పాలనా సంస్కరణలు, చెత్తసేకరణలో అవలంబించిన విధానాలతో కాకినాడ మెరుగైన ఫలితాలను సాధించి మంచి గుర్తింపునే తెచ్చుకుంది. తడి-పొడి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో అగ్రభాగాన నిలిచింది. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హూపర్ టిప్పర్ వాహనాలను పక్కన పెట్టడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారి, చెత్త సేకరణకు తీవ్ర అవరోధం ఏర్పడింది. తడి-పొడి చెత్త ఊసే లేకపోయింది. వాహనాలను తప్పించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టకపోవడంతో, నాటి సుందర నగరం నేడు మురికి కూపంగా మారుతోంది.

పట్టు లేని అధికారులు

పరిపాలన పరంగా కార్పొరేషన్ యంత్రాంగానికి కాకినాడ నగరంపై పూర్తి స్థాయిలో పట్టు చిక్కలేదు. కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ, కిందిస్థాయి అధికారులంతా బదిలీలపై వెళ్లిపోయారు. ఏఈ స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు పాత అధికారులంతా బదిలీలపై వెళ్లిపోవడంతో పరిపాలనా పరమైన పాలన గడచిన ఆరు నెలల్లో గాడి తప్పింది. గడచిన ఆరు నెలల్లో ఎక్కడా అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. చెల్లింపులు లేక కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. టౌన్ ప్లానింగ్ వంటి కీలక విభాగంలో ఇద్దరు ఏసీపీలు, ఒక డీసీపీ అవసరం కాగా, ఒకే ఒక్క ఇన్‌చార్జ్ డీసీపీతో నెట్టుకొస్తున్నారు. ఇలా ఏ రంగంలో చూసినా ఒక వెలుగు వెలిగిన కాకినాడ ఇప్పుడు దయనీయ పరిస్థితికి చేరుకుంది.

మంత్రి చొరవ చూపాలి

ఒకప్పటి సుందర నగరాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడకు వస్తున్న మంత్రి అన్ని విభాగాలపై ప్రత్యేకంగా సమీక్షించి, అవసరమైన ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు. సాధారణంగా మంత్రి హోదాలో పురపాలక శాఖ మంత్రి తొలిసారి ఇక్కడకు వస్తున్నప్పటికీ, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టే పరిస్థితి కూడా కనిపించడం లేదంటే, ఈ నగర పరిస్థితి ఎలా ఉందో అవగతమవుతోంది.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



రాయుడుపాలెంలో నకారా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ దీపిక

కాకినాడ రూరల్: రాయుడుపాలెంలోని ఏపీఎస్పీ రిటైర్డ్ పోలీసుల అధికారుల సంఘ కార్యాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ ఎం.దీపిక తొలుత విశ్రాంత ఉద్యోగుల జీవన జ్యోతి ధర్మ స్వరూప్ నకారా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 70 నుంచి 80 ఏళ్లున్న పెన్షనర్లను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ సత్యనారాయణ, జీఎస్ మూర్తి, కోశాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పెన్షన్‌దారుల వార్షిక సమావేశం

బాలాజీచెరువు: కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌దారుల వార్షిక సమావేశం మంగళవారం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరిగింది. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కేవీ రంగయ్య అధ్యక్షత వహించారు. తొలుత పెన్షనర్ల ఆరాధ్య దైవం డీఎస్ నకారాకు నివాళులర్పించారు. పెన్షన్‌దారుల సమస్యల పోరాటానికి సంఘ సభ్యులు ఐక్యతగా పోరాడాలని వక్తలు కోరారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తురగా సూర్యారావు, ఎస్పీఎన్ఎస్ సాయిరాం, జీఎస్ సర్వేశ్వరరావు, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

వేళంగిలో క్రిస్మస్ వేడుకలు



వేళంగి చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న డాక్టర్ జాన్‌బెన్నీ

కరప: మండలంలోని వేళంగిలో ఉన్న క్రైస్ట్ చాపెల్ చర్చిలో సోమవారం రాత్రి మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పి.సత్యప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బ్లెస్ వేళంగి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వలోక రక్షకుడు ఏసు ప్రభువు అన్నారు. కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ ఐ.జాన్‌సూర్యప్రకాష్, మండల ట్రెజరర్ రెవరెండ్ ఆర్.ప్రతాప్ కుమార్ ఈ వేడుకలను నిర్వహించారు. ద్రాక్షారామ గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ వి.జాన్‌బెన్నీ మాట్లాడుతూ, క్రీస్తు ప్రభువు ఏడు కారణాలతో లోకంలో జన్మించారని విశదీకరించారు. క్రిస్మస్ సందేశం వినిపించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు శుభాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. క్రీస్తు నేడు పుట్టెను నినాదం మార్మోగింది. క్రిస్మస్ పాటలతో బాల,బాలికలు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెవరెండ్ పి.స్పర్జన్‌రాజు, బ్రదర్ పి.రాజ్‌కుమార్, బ్రదర్ చార్లెస స్పర్జన్, కె.సూరిబాబు, సీహెచ్ విద్యాసాగర్, వై.కృపావరం, వి.మోషే, పి.సాయి, ఎస్ స్టీఫెన్‌రాజ్, వి.శాలెం, యు.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

• పొగ మేఘాలు



తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద రోడ్డును కమ్మేసిన పొగ

కాకినాడ రూరల్: కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారిపై తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద పొలాలు నుంచి వచ్చిన పొగ మంగళవారం రోడ్డును కమ్మేసింది. రైతులు తమ పొలంలోని వరి నుంచి పొట్టు, చెత్తను తగులబెట్టడంతో దట్టమైన పొగ వ్యాపించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అంతంతమాత్రంగా ప్రజా స్పందన

కాకినాడ రూరల్: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులకు ప్రజా స్పందన అంతంతమాత్రంగానే ఉంది. గ్రామాలలో రెవెన్యూ సదస్సులకు జనాలు అర్జీలు ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. నెల రోజుల క్రితమే రీ సర్వే గ్రామ సభలు నిర్వహించిన అధికారులు.. ఇప్పుడు రెవెన్యూ సదస్సుల పేరిట గ్రామాలకు వెళ్లడంతో జనాలు హాజరుకావడం లేదు. కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించింది. సదస్సులో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ సదస్సులో కొద్దిసేపటికే ఖాళీ అయింది. కేవలం 22 అర్జీలు మాత్రమే అందాయి.

పెనుగుదురు సదస్సులో పది అర్జీలు

కరప: మండలంలోని పెనుగుదురు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ విస్తీర్ణం హెచ్చుతగ్గులపై, సర్వే కోసం, సబ్ డివిజన్, మ్యుటేషన్ తదితర సమస్యలపై పది అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపావతి, ఆర్ఐ పవన్‌కుమార్, దేవదాయ శాఖ ఈఓ కె.తిరుమల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏపై డీపీఎం విచారణ

కాకినాడ రూరల్: పి.వెంకటాపురంవీఓఏ కనక మహాలక్ష్మిపై 28 డ్వాక్రా సంఘాల ఫిర్యాదుపై డీఆర్‌డీఏ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలను డీఆర్‌డీఏ డీపీఎం జిలానీ మంగళవారం విచారణ చేశారు. గ్రూపులను వీఓఏ మేనేజ్ చేస్తూ, నచ్చిన వారికి రుణాలివ్వడంతో పాటు, లెక్కలు చెప్పకుండా తీర్మానాలు రాసి సభ్యుల సంతకాలు తీసుకున్నట్టు మహిళలు తెలిపారు. ఒక గ్రూపు పేరిట తీసుకున్న రుణం రూ.12.80 లక్షలు అందించలేదని వివరించారు.

నిందితుడి అరెస్ట్

కరప: దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నించిన ఫీల్డు అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబును మంగళవారం కరప పోలీసులు అరెస్ట్ చేశారు. వేములవాడలో ఈ నెల 11న ఈ ఘటన జరిగింది. ఎస్సై టి.సునీత మంగళవారం నిందితుడు వీరబాబును అరెస్ట్ చేసి, కాకినాడ కోర్టులో హాజరు పర్చగా, నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

కమిషన్‌ను వ్యతిరేకించాలి

కాకినాడ సిటీ: నగరానికి ఈ నెల 19న వస్తున్న మిశ్రా వన్‌మన్ కమిషన్‌ను వ్యతిరేకించాలని కాకినాడ జిల్లా మాల సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకర్లతో వారు మాట్లాడారు. కమిషన్‌ను వ్యతిరేకిస్తూ నల్ల దుస్తులు ధరించి, వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రాలు ఇవ్వాలన్నారు.

బుక్‌లెట్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: ప్రజలపై విద్యుత్ భారాలకు కారణాలు, అదానీతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాల్లో ఏ అంశాలున్నాయనే దానిపై ఎంవీఎస్ శర్మ రచించిన నమో అదానీ-కరెంటు కహానీ అనే బుక్‌లెట్‌ను మంగళవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యురాలు జి బేబీ రాణి ఆవిష్కరించారు. హిండెన్ బర్గ్ రిపోర్ట్ వచ్చినప్పుడే అదానీ సంస్థలపై విచారణ జరిపించి ఉండాల్సిందన్నారు. దేశ సంపదను అదానీకి కట్టబెట్టడమే ధ్యేయంగా మోదీ పని చేస్తున్నారని విమర్శించారు. అదానీ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయడానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై స్మార్ట్‌గా విద్యుత్ భారాలు మోపుతున్నారని దుయ్యబట్టారు.

మత్స్యకార కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

కాకినాడ సిటీ: కోనసీమలో 1996 తుపానులో వేటకు వెళ్లి మరణించిన మత్స్యకార కుటుంబాలకు పరిహారం అందించాలని ఏపీ రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు లంకే మహేష్ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ తుపానులో వేటకు వెళ్లి 2,600 మంది మరణించారన్నారు. దీనిపై 28 ఏళ్లుగా న్యాయ పోరాటం చేశామన్నారు. గత నవంబర్‌లో చనిపోయిన మత్స్యకారులకు పరిహారమివ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. మృతుల వారసులను గుర్తించి, వివరాలను రెవెన్యూ, ఇన్సూరెన్స్ వారికి ఇస్తామన్నారు. మృతుల కుటుంబాల వారు కాకినాడ జగన్నాథపురం, చిన మార్కెట్ సాయిబాబా గుడి వద్ద ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.